

## పంటలు ఎండిపోయాయి

నాకు రెండున్నర ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇందులో ఎకరంన్నర వరి, మరో ఎకరం వేరుశనగ, పెసర పంటలు సాగు చేశా. కాల్వల ద్వారా చెరువులకు సరైన సమయంలో నీళ్లు రాలేదు. ప్రస్తుతం నీళ్లు లేక పంటలు ఎండిపోయాయి. మొత్తం రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా.

**– కంకణాల కనకరాజు, జక్కాపూర్, నారాయణరావుపేట మండలం, సిద్దిపేట జిల్లా**

## కరెంట్ రాక ఇబ్బందుల్లో కర్షకులు

- కాలుతున్న మోటర్లు..,
- ఎండుతున్న పంటలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- బావులు, కుంటల్లో తగ్గిన నీళ్లు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడులు
- పంట చేలను కాపాడుకోవడానికి రైతుల పాట్లు
- దర్శనమిస్తున్న బోరుబండ్లు, బావుల వద్ద క్రేన్లు

## నాలుగేండ్లలో ఎప్పుడూ ఎండిపోలే...

నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. యాసంగిలో నాలుగు ఎకరాల్లో వరిసాగు చేశా. ఇప్పుడు నీళ్లు రాక మూడు ఎకరాల్లో వరి పంట పూర్తిగాఎండిపోయింది. కేసీఆర్ సారు ఉన్నప్పుడు కాళేశ్వరం నీళ్లతో పంట పొలాలు పచ్చగా ఉండేవి. ఇప్పుడు నీళ్లు అందుతలేవు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పంటలు ఎండిపోయాయి. పెట్టుబడి కోసం మొత్తం రూ.60 వేల వరకు ఖర్చు చేశా.

**– గవ్వ కనకయ్య, గ్రామం, మండలం నారాయణరావుపేట, సిద్దిపేట జిల్లా**

# కాంగ్రెస్ వచ్చే.. కష్టాలు తెచ్చే..



సిద్దిపేట, మార్చి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. వచ్చి పోయే విద్యుత్‌తో మోటర్లు కాలిపోతున్నాయి. తరచూ మోటర్లు కాలడంతో రైతులకు పెట్టుబడి తడిసి మోపెడవుతుంది. వారం రోజుల నుంచి గ్రామాల్లో బోరు మోటర్లు బాగా కాలిపోతున్నాయి. సరాసరి ఒక్కో మెకానిక్ రోజుకు పది నుంచి పదిహేను మోటర్ల వరకు మరమ్మతులు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యత లేని విద్యుత్ సరఫరా చేయడంతోనే ఇలా మోటర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నాణ్యమైన కరెంట్ రావడంతో మోటర్లు కాలలేదు. గుంట పొలం ఎండలేదని రైతులు గుర్తు చేస్తున్నారు. మరో వైపు ఎండలు తారెత్తిస్తున్నాయి. రోజు రోజుకూ భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఫలితంగా యాసంగిలో సాగు చేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయి. పక్కనే రిజర్వాయర్లు ఉన్నా పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 3,30,000 వేల ఎకరాలు, మెదక్ జిల్లాలో 2,60,000 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 83,000 ఎకరాల్లో వరి సాగు చేశారు. గత యాసంగి కంటే ఈసారి కొంత మేర వరి సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుత యాసంగిలో సాగుచేసిన వరి పొట్ట దశకు వచ్చింది. ఈ సమయంలో నీళ్లు పుష్కలంగా కావాలి. చెరువులు, కుంటలు, బోరు బావులు ఎండిపోతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది.



నంగునూరు మండలం సిద్దన్నపేటలో ఎండిపోయిన వరి పొలం

## నీళ్లు లేక చేతికి వచ్చిన చేను ఎండిపోతుంది



నీళ్లు చాలక చేతికి వచ్చిన మొక్కజొన్న చేను ఎండిపోతుంది. ఐదెకరాలు కౌలుకు తీసుకున్నా. అందులో 2.20 గుంటల్లో మొక్కజొన్న, ఎకరం వరి సాగుచేశా. నీరు లేక 1.20 గుంటల భూమి వదిలిపెట్టా. గతంలో కుంటలో నిండానీరు ఉండే. కౌలుకు తీసుకున్న పొలం మొత్తం పారింది. ఈ సంవత్సరం కుంటలో నీరు లేక బావి ఎండిపోయింది. మరో నాలుగు తడులు పెడితే మొక్కజొన్న పంట చేతికి వచ్చేది. ఇప్పుడు నీళ్లు అందుతలేవు. చేను ఎండిపోయి, పంట కష్టంగా మారింది. ఇప్పటికే మొక్కజొన్న, వరికి కలిపి రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టా. ఈసారి పెట్టుబడి వచ్చుడు కూడా గగనమైంది. కౌలు పైసలు రూ.75,000, పెట్టుబడి కలుపుకొంటే రూ.1,35,000 వేల వరకు ఖర్చు వచ్చింది. ఈసారి లాగోడి ఎల్లుడు కూడా కష్టమే.

**– ముక్కెర దేవయ్య, చందులాపూర్, చిన్నకోడూరు మండలం, సిద్దిపేట జిల్లా**



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో బోరు వేస్తున్న రైతు



నారాయణరావుపేటలో కాలిపోయిన మోటరును రిపేరు చేస్తున్న మెకానిక్

## కాలుతున్న మోటర్లు

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతాంగానికి నాణ్యమైన 24 గంటల కరెంట్ సరఫరా చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన కరెంట్ రావడం లేదు. దీంతో బోరుబావుల మోటర్లు కాలిపోతున్నాయి. బోరు నుంచి మోటరును పైకి తీసి రిపేరు చేయించి మళ్లీ దించడానికి ఎంత లేదన్నా సుమారు రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. ఒక్కో రైతు మోటరు వారంలో రెండుసార్లు కాలిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఎక్కడ చూసినా కాలిపోయిన మోటర్లు కనిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో కరెంట్ మెకానిక్‌లకు పనిలేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే కరెంట్ మోటరు మెకానిక్‌లకు చేతినిండా పని కల్పించినట్లైంది. మోటర్ల రిపేరు కొంత ఆలస్యమైతే పొలాలు ఎండిపోతున్నాయి.

## పొలాల వద్ద బోరుబండ్లు, క్రేన్లు

వరితోపాటు ఇతర పంటలను కాపాడుకోవడానికి రైతులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడెనిమిదేండ్ల తర్వాత మళ్లీ రైతుల పొలాల వద్ద పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. తెలంగాణ ఏర్పడక ముందు ఎక్కడ చూసినా బోరు బండ్లు కనిపించేవి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బోరు బండి, బావుల వద్ద క్రేన్లు కనిపించలేదు. ఇవాళ ఎక్కడ చూసినా పంట పొలాలను రక్షించుకోవడానికి రైతులు బోర్లు వేస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా బోరు బండ్లు దర్శనమిస్తున్నాయి. మరో వైపు పూడికతీతతోపాటు బావులను తవ్వుతున్నారు. ఫలితంగా సిద్దిపేట జిల్లాలో ప్రస్తుతం బోరు బండ్లు, క్రేన్ల యజమానులు బిజీగా మారారు. ఇంకో వైపు ఎండిన పంట చేన్లలో రైతులు పశువులను మేపుతున్నారు.

## ఎక్స్‌ట్రా పైపులు దించుడైతుంది



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గీ సారే యాసంగి పంటలకు నీళ్ల ఇబ్బంది ఏర్పడింది. మా గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో రైతుల బోర్లలో నీళ్లు తక్కువ అయ్యాయి. రైతులు పొద్దుగాల్లనే నా దగ్గరకు వచ్చి బోరులో మరో రెండు పైపులు దించాలని తీసుకువెళ్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు బోరు, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉండేది.

**– బచ్చల బాబు, మోటరు మెకానిక్, గురువన్నపేట, కొమురవెల్లి మండలం సిద్దిపేట జిల్లా**



సిద్దిపేట జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటడంతో అదనంగా పైపులు దించుతున్న అన్నదాతలు

## నిరుడు, ముందటేడు బాగానే ఉండే..



ఎకరం పొలం, ఇంత నువ్వుల పంట సాగుచేశా. నిరుడు, ముందటేడు బాగానే ఉండే. ఈసారి బావుల్లో నీళ్లు లేవు. వరుస తడులు అయితున్నాయి. బావి తవ్వాలంటే స్థోమత లేదు. అందుకనే ఇరవై వేల రూపాయలు ఖర్చుచేసి పూడిక తీయిస్తున్నా. మూడురూపాయల మిత్తికి డబ్బులు తెచ్చి పనులు చేయిస్తున్నా. ఎనిమిదేండ్ల నుంచి నీళ్లకు ఇంత తిప్పలు రాలేదు.

**– పచ్చిమట్ల ఎల్లయ్య, రైతు, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా**

## రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టా



యాసంగిలో రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. గ్రామంలో ఉన్న చెరువులకు నీళ్లు సమయానికి రాలేదు. ఇప్పుడు నీళ్లు లేక మొత్తం రెండు ఎకరాలు ఎండిపోయింది. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఉంది. రెండు ఎకరాల్లో పంటపెట్టుబడి కోసం రూ.20 వేల వరకు ఖర్చు పెట్టా. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు.

**– కోడి సూరయ్య, జక్కాపూర్, నారాయణరావుపేట మండలం**

## రెండు ఎకరాల పంట ఎండిపోయింది



నాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా గ్రామంలోని చెరువులకు నీళ్లు వచ్చేవి. ఇప్పుడు రావడం లేదు. నీళ్లు రాకపోవడంతో రెండు ఎకరాల్లో పంట ఎండిపోయింది. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలుస్తలేదు. పంట పెట్టుబడి కోసం రూ.25 వేల వరకు ఖర్చు చేశా. కాల్వల ద్వారా నీళ్లు వస్తే పంటలు పండుతుండే.

**– పుర్ర శంకర్, గ్రామం, మండలం నారాయణరావుపేట , సిద్దిపేట జిల్లా**

# సారూ.. సాగుకు నీరు

## ఎండుతున్న పంటలను చూసి రోడ్డెక్కిన రైతులు

చిన్నకోడూరు, మార్చి 4: ఎండిపోతున్న పంటలకు సాగునీరు ఇవ్వాలని సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి రైతులు రామునిపట్ల రాజీవ్ రహదారిపై సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రంగనాయకసాగర్, అనంతగిరి రిజర్వాయర్ మధ్యలో భూములు ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదన్నారు. నాలుగు వందల మీటర్ల కాల్వ తవ్వితే 500 కుటుంబాలు బాగుపడుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూ సేకరణ చేపట్టి పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు భారంగా మారాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. రైతుల నిరసనతో రాజీవ్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామైంది. విషయం తెలుసుకున్న చిన్నకోడూరు పోలీసులు రైతులను సముదాయించి నిరసన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు మండలం రామునిపట్ల రాజీవ్ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు

## మల్లన్నసాగర్ ప్రధాన కాల్వ వద్ద రైతుల నిరసన

దుబ్బాక టౌన్, మార్చి 4 : కాల్వలు పూర్తి చేసి నీరు అందించాలంటూ దుబ్బాక, చెల్లాపూర్, మల్లాయిపల్లి, కమ్మరపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం చెల్లాపూర్ సమీపంలోని మల్లన్నసాగర్ ప్రధాన కాల్వ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నీళ్లు వస్తాయన్న ఆశతో పంటలు సాగుచేసుకుంటే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాల్వలను దుబ్బాక ప్రాంతానికి తీసుకువస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 50 అడుగుల దూరం కాల్వను తవ్వించలేదని ఆరోపించారు. కాల్వను తవ్వించి ఉంటే మల్లాయిపల్లి, కమ్మరపల్లి, అచ్చుమాయిపల్లి, పోతారం, చీకోడ్, ఆరేపల్లి గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందేదన్నారు. ఓ పక్క భూగర్భ జలాలు అడుగంటడం, మరో పక్క మల్లన్నసాగర్ నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, పుష్కలంగా నీళ్లు ఇచ్చారని రైతులు గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం 10 గంటల పాటు సరైన కరెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. నిరసన సమయానికి అక్కడికి వచ్చిన కాంట్రాక్టర్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు. సుమారు గంట పాటు రోడ్డు పై బైఠాయించిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



దుబ్బాక టౌన్: మల్లన్నసాగర్ పంట కాల్వను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో వాగ్వాదం చేస్తున్న రైతులు

# నేడు ప్రధాని మోదీ రాక

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- అధికారిక కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి
- భారీ బందోబస్తు మధ్య ప్రధానికి ఆహ్వానం
- జనసమీకరణకు పూనుకుంటున్న బీజేపీ నేతలు



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో మోదీ బహిరంగ సభ ఏర్పాట్లు



పటాన్‌చెరులో ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్‌చెరు, మార్చి 4: సంగారెడ్డి జిల్లా వేదికగా ప్రధానిమోదీ వర్చువల్‌గా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంగళవారం జిల్లాలో పర్యటిస్తున్న ఆయన పటాన్‌చెరు పట్టణ పరిధిలోని పటేల్‌గూడ వెళ్లే దారిలో జరుగనున్న అధికారిక ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి హాజరవుతారు. అనంతరం పక్కనే ఉన్న గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. వర్చువల్ విధానంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. పక్కన ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. జాతీయ స్థాయి భద్రత బృందాలు భారీ రక్షణ చర్యలు చేపట్టాయి. ప్రధాని వ్యక్తిగత భద్రత సిబ్బంది సూచనల మేరకు అక్కడ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ కేంద్ర బృందాలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో శ్రమిస్తున్నారు. కార్యక్రమానికి బీజేపీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు హాజరవుతారు.

## ఘనంగా మల్లన్న కల్యాణం

చేగుంట, మార్చి 4: మెదక్ జిల్లా చేగుంట మండలంలోని చందాయిపేటలో కేతకీ భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. సాయంత్రం బోనాలు, అగ్నిగుండ ప్రవేశం, ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు, తీర్థప్రసాదం, అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ సంతోష్‌కుమార్, సొసైటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాయిని రాజ్‌గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు, అలం శ్రీ కాంత్, అలీ, యాదవ సంఘం నాయకులు ఎర్ర కిష్టయ్య, యాదయ్య, మల్లేశ్, సత్తయ్య, నాగరాజు పాల్గొన్నారు.

### పుట్టిన రోజు వేడుకల్లో..

కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద ఐకేపీ శ్వేత శంకర్ కుమారుడి పుట్టిన రోజు వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



చందాయిపేటలో మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే

# కఠిన చర్యలు

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



సంగారెడ్డి జిల్లా హత్నూర మండల సమావేశంలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మార్చి4: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వావిలాల నర్సింహులు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి పలుశాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి నిర్వహించే మండల సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీచేయాలని ఎంపీడీవో శంకర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరవికుమార్, తహసీల్దార్ ఫర్వీన్‌షేక్, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ అందజేత

హత్నూర మండలం నస్తీపూర్ గ్రామానికి చెందిన కొడిపాక రాములుకు అత్యవసర చికిత్స కోసం రూ.లక్షా20వేల ఎల్‌వోసీని బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. సునీతమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల కోసం సేకరించిన దరఖాస్తులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శివశంకర్‌రావు పాల్గొన్నారు.